

ఘనంగా పవర్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి-అమలాపురం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీలు గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పోటీలకు ముఖ్యఅతిథిలుగా కుడుపూడి సూర్యనారాయణ రావు, మునిసిపల్ చైర్పర్సన్ రెడ్డి నాగేంద్రమణి, మున్సిపల్ కమిషనర్ నాయుడు, జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు అధిక సంఖ్యలో విచ్చేశారు. మహిళల విభాగంలో ప్రథమ బహుమతి రాజమహేంద్రవరానికి చెందిన హాసిని, రెండవ స్థానం ముమ్మిడివరానికి చెందిన శ్రావ్య, మూడో స్థానం అమలాపురానికి చెందిన వందన గెలుచుకున్నారు. పురుషుల విభాగంలో రాజమహేంద్రవరానికి చెందిన ఎ.బాలకృష్ణ అత్యధికంగా పవర్ లిఫ్టింగ్ మూడు విభాగాలలోను700 కేజీల బరువుని ఎత్తి విజేతగా నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎనుముల పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

జిఓ1 ఉపసంహరణకు సిఐటియు డిమాండ్

జిల్లాలో పలుచోట్ల వివిధ రూపాల్లో నిరసనలు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

రాష్ట్రంలో రోడ్‌షోలు, ర్యాలీలు నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెం1 ను తక్షణమే ఉపసంహరించుకోవాలని గురువారం సిఐటియు ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. సిఐటియు మండల కార్య దర్శి జి.బేబి గంగారత్నం మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేందుకు ఏ పేరుతో అణిచివేసినా సిఐటియు ప్రతిఘటిస్తుందన్నారు. కందుకూరు, గుంటూరు ఘటనలను ఆసరా చేసుకొని రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీ రోడ్లల్లో సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు నిషేధించడం అప్రజాస్వామికమన్నారు. ఇప్పటికే కార్మికులు, రైతులు, ప్రజలు తమ కోర్కెలు, హక్కులకోసం ఆందోళనలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని అడ్డు పెట్టుకుని అణచివేస్తోందని, ముందస్తు అరెస్టులు చేస్తున్నారని సభలకు, ర్యాలీలకు అనుమతి నివ్వడంలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్‌షోలు, ర్యాలీలు నియంత్రించే జిఒను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జె.భద్ర కాళి, డి.ధనలక్ష్మి, ఎస్.సుబ్బలక్ష్మి, పి.పరిపూర్ణ తదితరులు పాల్గొన్నారు. **కాట్రేనికోన** రాష్ట్రంలో రోడ్‌షోలు, ర్యాలీలు నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెం.1ని ఉపసంహరించుకోవాలని కాట్రేని కోన సిఐటీయూ కమిటీ ఆధ్వర్యం లో తహశీల్దార్ ఆఫీస్ వద్ద ధర్నా చేసి జిఒ కాపీని దహనం చేశారు. అనంతరం తహశీల్దార్‌కువినతిపత్రం సమర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నకెలె సూర్యనారాయణ, మండల సిఐటియు కార్యదర్శి విత్తనాల రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి పోరాటహక్కులను కాలరాయటానికి జిఒను తీసుకువచ్చిందని, జిఒ1ని ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల ఉపాధ్యక్షులు విపర్తి మోహన్‌రావు, బొంతు పార్వతి, సత్యవతి, వైదాడిఅమ్మాజి, మంగా, జి.ధన లక్ష్మి, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలగుప్తంలో అంగన్ వాడీలు, సిఐటియు నాయకుల ఆందోళన



కాట్రేనికోనలో జిఒ కాపీని దహనం చేస్తున్న సిఐటియు నాయకులు

పర్యవేక్షణా లోపంతోనే ప్రమాదం

విజ్డమ్ స్కూల్ ఘటనపై ఎంఎల్‌సి ఐవి బాధిత విద్యార్థులకు పరామర్శ

ప్రజాశక్తి-అమలాపురం

ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి విజ్డమ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో బుధవారం జరిగిన సంక్రాంతి సంబరాల్లో చోటు చేసుకున్న ఘటన పాఠశాల యాజమాన్యం పర్యవేక్షణ లోపమేనని పిడిఎఫ్ ఎమ్ఎల్‌సి ఐవి అన్నారు. ఘటనలో గాయపడిన విద్యార్థులను గురువారం ఆయన పరామర్శించారు. కిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్‌తో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై మాట్లాడారు. ఘటన దురదృష్టకరమని అన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెట్రోల్ వంటి ప్రమాదకర పదార్థాలను పాఠశాల విద్యార్థుల చేతికి అందించడం విచారకరమని అన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆరోగ్యంతో విద్యార్థులు ప్రమాదం నుంచి బయటపడాలని ఐవి అన్నారు. ఐవి వెంట సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఉన్నారు.

కల్టెకర్ పరామర్శ

గొల్లవిల్లి విజ్డమ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ నందు బుధవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా జరిగిన ఘటనలో ముగ్గురు విద్యార్థులు తీవ్ర గాయాల పాలైన విషయం విదితమే.



చికిత్సపొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న కలెక్టర్



ఆస్పత్రిలో విద్యార్థులను పరామర్శిస్తున్న ఎంఎల్‌సి ఐవి

వీరు స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న వసిషా, మధుర కీర్తన, దిగుమర్తి సామియల్ స్టీఫెన్‌లను గురువారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పరామర్శించారు. వీరికి మెరుగైన వైద్య సేవలను ప్రత్యేక వైద్య నిపుణుల ద్వారా అందించాలని ఆస్పత్రి వర్గాలకు ఆయన సూచించారు. ఆవిధంగా చిన్నారుల తల్లిదండ్రులకు ధైర్యం చెబుతూ మీ పిల్లల ఆరోగ్యం పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని త్వరలోనే అందరూ కోలుకుంటారని అన్నారు. ప్రత్యేకమైన మెరుగైన వైద్య సేవలు అందేలా ఇప్పటికే చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు.

ఉప్పలగుప్తం అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు విద్యార్థులను గురువారం దళిత నాయకులు పరామర్శించారు. అనంతరం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ను అయినవిల్లి జెడ్‌పిటిసి గన్నవరపు శ్రీనివాసరావు, దళితనాయకులు ఇసుకపట్ల రఘుబాబు, జంగా బాబురావు, గిడ్ల వెంకటేశ్వరరావు, రాంబాబు, బాలరాజులు కలిసి బాధిత చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

అలాగే బాధిత చిన్నారుల కుటుంబాలు దళిత సామాజిక వర్గానికి చెందిన పేద వ్యవసాయ కూలీలని వారికి ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా చెల్లించి అన్నివిధాలా ఆదుకోవాలని వారు కల్టెర్‌ను కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపామని అన్నారు.

'విజ్‌డమ్' ఘటనపై డిఇఒ విచారణ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గొల్లవిల్లి విజ్‌డమ్ పబ్లిక్ స్కూల్లో జరిగిన ఘటనపై డిఇఒ రవిసాగర్ గురువారం విచారణ చేపట్టారు. పబ్లిక్ స్కూల్లో బుధవారం జరిగిన సంక్రాంతి సంబరాల్లో భోగిమంట కారణంగా ముగ్గురు చిన్నారులు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం విదితమే. ఈ ఘటనకు సంబంధించి కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు డిఇఒ రవి సాగర్ తహాశీల్దార్ జె. వెంకటేశ్వరి, ఎంఇఒ కె.కిరణ్ బాబు, ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు ల సమక్షంలో విజ్‌డమ్ పబ్లిక్ స్కూల్లో తరగతి గదులను సదుపాయాలను, ఘటనకు కారణమైన భోగిమంటను పరిశీలించారు.

స్కూల్ రికార్డులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం స్కూల్ కరస్పాండెంట్ దేవరపల్లి దుర్గ, పబ్లిక్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను జరిగిన సంఘటనకు సంబంధించి వారి నుంచి వివరాలు తీసుకున్నారు. విచారణ అనంతరం నివేదికను కలెక్టర్ కు అందజేస్తానని డిఇఒ విలేకరులకు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం

108 ఉద్యోగులను ఎపి అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిం చాలని 108 కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు గురువారం అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించాలని పిఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని, ఉద్యోగులపై పని భారం పడకుండా ఎనిమిది గంటల పనిమీద అని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులందరూ ఈ నెల 14న నిరసన కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. అనంతరం ఎమ్ఎల్ఎలకు, ఎంపీలకు, మంత్రులకు వినతి పత్రాలు అందజేస్తామన్నారు. ప్రభుత్వం అధికారులు సానుకూలంగా స్పందించకపోతే ఈ నెల 15 తర్వాత సమ్మె నోటీసు ఇచ్చే అవకాశం ఉందని రాష్ట్ర వ్యాప్తంగా 108 ఉద్యోగులు సమ్మె చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బలరాం, శ్రీనివాస్, జయరాం, సత్యనారాయణ, చిట్టిబాబు 108 ఉద్యోగులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న 108 ఉద్యోగులు

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

సంక్రాంతికి ఎవరైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని కొత్తపేట ఆర్‌డిఒ ఎం.ముక్కంటి, సిఐ ఎన్.రజనీ కుమార్ హెచ్చరించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, ఎంపిటిసి సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు అనగా కోడిపందేలు, జూదం, గుండాట, పేకాట, మేళాలు వంటివి నిర్వహించకుండా చూడాలన్నారు. ఇందుకు గ్రామ, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పందేలను కట్టడికి పోలీసులు వ్యూహాత్మక చర్యలు తీసుకుంటున్నారన్నారు. దీనిపై గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు మాట్లాడుతూ గ్రామ సర్పంచులు దృష్టికి కోడి పందేలు, జూదం వంటి విషయాలు వస్తే మేము సహకరించబోమన్నారు. కార్యక్రమంలో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, తహశీల్దార్ జి.లక్ష్మీపతి, ఎంపిడిఒ కె.జాన్ లింకన్, ఎస్ఐ ఎస్.శివప్రసాద్, వైస్ ఎంపిపి దుర్గా భవాని, మాజీ ఎంపిపి తోరాటి రాంబాబు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ ముక్కంటి



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

సిఐటియు మహాసభ విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-రామచంద్రపురం

జనవరి 18 నుంచి జరిగే ఆల్ ఇండియా సిఐటియు మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి నూకల బలరాం పిలుపునిచ్చారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 24 వరకూ బెంగుళూరు లో జాతీయ మహాసభ లు నిర్వహిస్తారన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా పాలన సాగిస్తోందని విమర్శించారు. జిఒ నెం.1ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ అధ్యక్షులు దుర్గమ్మ, సిబ్బంది, సిఐటియు కార్య కర్తలు పాల్గొన్నారు.


ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-యంంత్రాంగం


పల్లెలు, పట్టణాలు సందడిగా మారాయి. సంక్రాంతి సందర్భంగా పలుచోట్ల సంబరాలు గురువారం ఘనంగా నిర్వహిస్తున్నారు. **మండపేట** స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్లో తొలిసారి సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రెండో వార్డు కౌన్సిలర్ చిట్టూరి సతీష్ విచ్చేశారు. అనంతరం స్కూల్ ఆవరణలో వివిధ రకాల కార్యక్రమాలతో పాటు రంగవల్లులు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిస్టర్ జూలియట్, కరస్పాండెంట్ రీనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక రావులపేటలో విద్యావికాస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థులు రైతులు, హరిదాసు తదితర వేషధారణలు ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల అధ్యక్షులు ఆధ్వర్యంలో జరిగిన సంబరాలలో గొబ్బిల్లు, బొమ్మల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రధానోపాధ్యాయులు బొల్లోజు పార్వతి, డి.శ్రీనివాసు తదితరులు సంక్రాంతి పండుగ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు పి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు** చెముడులంక నేతాజీ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థులతో పలు సంస్కృతిక కార్యక్రమాలు కరస్పాండెంట్ యెరుబండి శ్రీనివాసు, ప్రిన్సిపల్ సునంద, ఇంచార్జ్ పద్మావతిల ఆధ్వర్యంలో నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ పాల్గొని సంక్రాంతి వేడుకల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో యెరుబండి శ్రీరామచంద్రమూర్తి, వార్డు సభ్యులు దొండపాటి చంటి, వైసిపి గ్రామ అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు మోటూరి సురేష్, తమ్మన హరి, స్కూల్ పిఎంసి ఛైర్మన్లు సుంకర శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** ప్రజలందరికీ నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. నగర పంచాయతీలో ముందస్తు సంక్రాంతి ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో వైస్ ఛైర్మన్లు రెడ్డి హేమ సుందరి, వేటుకూరి బోసు రాజు, ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ, కౌన్సిలర్లు తదితరులుపాల్గొన్నారు. **కాట్రేనికోన** చెయ్యేరు నందు గల శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాల్లో సంక్రాంతి సంబరాలను అమలాపురం డిఎస్‌పి వై. మాధవరెడ్డి ప్రారంభించారు. వివిధ ఆట పోటీలలో విజయం సాధించిన విద్యార్థిని విద్యార్థులకు కలశాల కరస్పాండెంట్ డివిఎన్ఎస్ వర్మ బహుమతి ప్రదానం చేసారు. కార్యక్రమంలో కళాశాల ప్రినిపల్ బి. రత్నరాజు, పాలకవర్గం సభ్యులు రమేష్ రాజు, సందీప్ లు ప్రొగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ టి.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం రూరల్** అమలాపురం స్థానిక వెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.వి.ఆర్. ఎన్. నరసింహరావు, ప్రిన్సిపల్ కె.మనోహర్,కరాటం ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** పట్టణం లోని మోడరన్ విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మోడరన్ అధినేత లయన్ జివి.రావు, డిగ్రీ ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వర్లు, డిగ్రీ అకడమిక్ డైరెక్టర్ కే.సాయిరాంచౌదరి తదితరులు పాల్గొన్నారు



చెయ్యేరులో శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల్లో సంక్రాంతి వేడుకల్లో డిఎస్‌పి



మండపేటలోని విద్యావికాస్ విద్యా సంస్థలో సంక్రాంతి సందడి



ఆలమూరు మండలం చెముడుకలంకలో నేతాజీ స్కూల్లో సంక్రాంతి వేడుకలు



రామచంద్రపురం మోడరన్ విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలు

పాఠశాల స్థల పరిశీలన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

కామనగరువు చిట్టెమ్మ చెరువు పాఠశాలకు సంబంధించిన స్థలాన్ని గురువారం పంచాయతీరాజ్ డిఇ రాజ్ కుమార్ పరిశీలించారు. చిట్టెమ్మ చెరువు వద్ద హైవే రోడ్డు విస్తరణలో ఈ పాఠశాలను తొలగించడంతో నూతన పాఠశాల భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించారు. ఈ నూతన భవన నిర్మాణానికి కావలసిన నిధులను కలెక్టర్ మంజూరు చేస్తారని డిఇ తెలిపారు. ఆయన వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్ శివ, నక్క చంద్రశేఖర్ ఉన్నారు.

కామనగరువులో మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

కామనగరువు పంచాయతీ నందు గురువారం 104 మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమాన్ని సర్పంచ్ నక్కా అరుణకుమారి పర్యవేక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.శాంతిలక్ష్మి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ శ్రీదేవి

కార్టూ'నిజం'



నేను పెద్దగా చదువుకోలేపోయినా... మీకంటే... నా సలహాలనే పాటిస్తారయ్యా మా పెద్ద.. సారు..! తెలుసా..!!!

ఘనంగా వివేకానంద జయంతి


ప్రజాశక్తి-యంత్రాంగం

స్వామి వివేకానంద జయంతిని గురువారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు అధికారులు, నాయకులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమలాపురం స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ హిమాన్షు శుక్లా, అధికారులు స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ వివేకానంద చేసిన సేవలకు గుర్తింపుగా 1984లో భారత ప్రభుత్వం ఆయన జయంతిని 'జాతీయ యువజన దినోత్సవం' ప్రకటించిందన్నారుకార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, డిఇఒ ఎన్‌వి.రవి సాగర్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి పి.జ్యోతిలక్ష్మి దేవి, కలెక్టరేట్ పరిపాలనాధికారి కాశీ విశ్వేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. **మండపేట** సమాజాన్ని ప్రభావితం చేసిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని హోయో వైద్యులు డాక్టర్ చల్లా రవి కుమార్ అన్నారు. స్థానిక ఆలమూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజన ఉత్సవాలు కళాశాల డైరెక్టర్ ఇనపకోళ్ళ గణేష్ చౌదరి అధ్యక్షతన జరిగాయి. ఒబిలినేని శ్రీనివాస చౌదరి మాట్లాడుతూ వివేకానందను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన డిగ్రీ విద్యార్థులకు సర్పంచ్ గుణ్ణం రాంబాబు జ్ఞాపికలను అందజేశారు. యువజనోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాబి తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు** వివేకానంద జయంతి వేడుకలు గురువారం మండలంలోని గుమ్మిలేరులో సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పలువురు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు **అయినవిల్లి** మండలం లోని నేదునూరులో రావి ఫౌండేషన్ నందు వివేకానంద యువత ఆధ్వర్యంలో వివేకానంద జయంతి నిర్వహించారు. ఎమ్ఎల్ఎ కొండేటి చిట్టిబాబు పాల్గొని రావి ఫౌండేషన్ కంప్యూటర్ సెంటర్ నందు పిజిడిసిఎ కోర్సు పూర్తి చేసిన 62 మందికి ధృవ పత్రాలు అందజేశారు. జిల్లా స్థాయి వాలీబాల్ టోర్న మెంట్ విజేతగా నిలిచిన పి.గన్నవరం నియోజకవర్గ వాలీబాల్ జట్టుకు కప్, రూ.10వేలు అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన కొత్తపేట నియోజకవర్గ జట్టుకు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి బయ్య చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో వివేకానందుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ శుక్లా



నేదునూరులో వాలీబాల్ విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్ఎల్ఎ

వాటర్ ట్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి -మండపేట

పట్టణంలోని వైస్సార్ నగర్‌లో టిడ్కో గృహ సముదాయంలో నిర్మించిన వాటర్ ట్యాంక్ ను ఎమ్ఎల్‌సి తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైసిపి యువ నాయకులు తోట పృథ్వి రాజ్ గురువారం ప్రారంభించారు. తోట మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ విప్ పోతంశెట్టి వరప్రసాద్, మొండి భవాని, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భోగి వేడుకలకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఆలమూరు

తమ గ్రామంలో జరిగే భోగి వేడుకలకు రావాలని జిల్లా కలక్టర్ హిమాన్షు శుక్లాను గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆహ్వానించారు. భోగి రోజున తమ గ్రామంలో జరిగే వేడుకలకు హాజరు కావాలని గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాంబాబు కలెక్టర్‌కు భోగి దండ ఇచ్చి కుటుంబ సభ్యులతో కలిసి రావాలని ఆహ్వానించారు. ఏ మాత్రం అవకాశం ఉన్నా తప్పకుండా వస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు సర్పంచ్ రాంబాబు తెలిపారు.

'యువగళం' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం టిడిపినియోజకవర్గ ఇంచార్జ్ అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు గురువారం స్వామి వివేకానంద జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నారా లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా యువగళం పోస్టర్లు ఆవిష్కరించి ర్యాలీ చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో 28, 29 వ వార్డుల్లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.

పురపాలక సంఘానికి బ్యాంకుల వితరణ

ప్రజాశక్తి -రామచంద్రపురం

రామచంద్రపురం పురపాలక సంఘానికి పలు బ్యాంకులు వివిధ వస్తువులు అందజేశాయి. ఇక్కడ గల మెప్మా పట్టణ మహిళా సమాఖ్యకు కంప్యూటర్‌ను బ్యాంక్ ఆఫ్ బరోడా, కుర్చీలను కెనరా బ్యాంక్, బయో-మెట్రిక్ డివైజెస్‌ను ఆంధ్రా బ్యాంక్, బీరువా ఆఫీసు ఫర్నీచరును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సుమారు రూ.1లక్ష విలువ గల వస్తువులు బహూకరించారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ కె.శ్రీకాంత్ రెడ్డి, బి.ప్రియంవద, ఐ.అరుణ, వి.శ్రీనివాస్, సుధీర్ కుమార్ గౌతమ్, ఆర్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-మండపేట

పట్టణంలోని 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.93 కోట్లతో మారేడుబాక జంక్షన్ నుంచి ఇందిరా గాంధీ బైపాస్‌కు చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులను ఎమ్ఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు గురువారం పరిశీలించారు. అధికారులను రోడ్డు నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో రోడ్డు పనులు పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట టిడిపి నాయకులు ఉన్నారు.

59 పరిపాలనా భవనాల నిర్మాణం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట మండలంలో అన్ని గ్రామాలకు అందుబాటులో ఉండే విధంగా పరిపాలనా సౌలభ్యంలోగా భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయిలు వెచ్చించి 59 భవనాలను, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నట్లు ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని సేవలు ఒకేచోట అందుబాటులో ఉంచే విధంగా సచివాలయం వ్యవస్థను అమలు చేస్తున్నట్టు చెప్పారు. దానిలో భాగంగానే మండలానికి మంజూరైన 59 భవనాలకు ఇప్పటికే 12 భవనాలు పూర్తయి ప్రారంభాలు చేసుకోగా, మరో 10 భవనాలు మరో పది రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. మిగిలిన భవనాలు విషయంలో కాంట్రాక్టర్ల సమస్యల వలన కొంత జాప్యం ఉన్నా వాటిని పూర్తిగా చేయనున్నట్టు ఆయన చెప్పారు. కాపవరం గ్రామంలో నిర్మించిన వంతెన పనులు పూర్తి కాగా దానికి ప్రారంభోత్సవంతో ప్రమేయం లేకుండా,ప్రజల ఇబ్బందులు తీర్చడమే లక్ష్యంగా వాడుకలోకి తెచ్చినట్లు ఎంపిపి సత్తిబాబు చెప్పారు. ఈ సందర్భంగా మండల ప్రజలందరికీ ఆయన సంక్రాంతి శుభాకాంక్షలను తెలిపారు. సమావేశంలో ఎంపీడిఒ డి.శ్రీ లలిత, ఎఒ విప్పర్తి వీర సాయి బాబు పాల్గొన్నారు.

ఉపాధి పనులు నాణ్యంగా చేపట్టాలి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

ఎటువంటి ఆడిట్ అభ్యంతరాలకు తావులేకుండా ఉపాధి హామీ పనులు అత్యంత నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ అడపా వెంకటలక్ష్మి ఆదేశించారు. అచ్చంపేటలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల రికార్డులను, మస్తరులను పరిశీలించి పనులు నాణ్యంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. పిడి వెంట మండల ఉపాధిహామీ ఎపిఒ ప్రభాకరరావు, ఫీల్డు అసిస్టేంట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సిఐడి వలలో 'పచ్చ ముఠా'

- జమ్మలమడక నాగమణి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రాష్ట్రాన్ని అన్ని విధాలుగా దోచుకున్న చంద్రబాబు నేడు నీతీ కబుర్లు చెబుతుండడం సరికాదని రాష్ట్ర వైసిపి మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి జమ్మలమడక నాగమణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు నారాయణ విద్యా సంస్థల అధినేత ఇండ్లు, కార్యాలయాలపై సిఐడి దాడుల నేపథ్యంలో ఆమె మీడియాతో మాట్లాడారు. సిఐడి దాడులల్లో పచ్చ బ్యాచ్ అవినీతి అక్రమాలు బయటపడుతున్నాయన్నారు. చంద్రబాబు బంధువులు, పచ్చ బ్యాచ్ కలిసి అతిపెద్ద కుంభకోణానికి పాల్పడ్డారన్నారు. అమరావతి భూముల వ్యవహారంలో టీడీపీ పెద్దల గుప్పిట్లో బడుగులకు చెందిన అసైన్డ్ భూములు దాదాపు 932 ఎకరాలు చంద్రబాబు బృందం పేర ఉన్నాయని ఆరోపించారు. రాజధాని అమరావతి ప్రాంతంలో 2014 నాటికి ఎస్సీ, బీసీ రైతుల పేరిట ఉన్న అసైన్డ్ భూములు గత సర్కారు హయాంలో ఇతరుల పేరుతో సీఆర్‌డీఏ రికార్డుల్లో నమోదు చేసుకుని భారీ కుంభకోణానికి పాల్పడ్డారనీ, రాజధాని నిర్మాణం తరువాత అమరావతిలో ఎకరా మార్కెట్ విలువ కనీసం రూ.4 కోట్లకు చేరుతుందని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే ప్రకటించిన సంగతి గుర్తు చేశారు. టీడీపీ పెద్దలు హస్తగతం చేసుకున్న 932.72 ఎకరాల అసైన్డ్ భూముల మార్కెట్ విలువ రూ.3,730.88 కోట్లకు పైమాటేనని ఆరోపించారు. చంద్రబాబు, తన బ్యాచ్ పాపం పండే రోజు త్వరలోనే ఉందని జమ్మలమడక స్పష్టం చేశారు.

ఘనంగా 'శ్రీ సూర్య' కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం నీలాద్రి పేట గ్రామ శివారు పరిణయ ఫంక్షన్ హాల్ శ్రీ సూర్య జూనియర్‌కళాశాల 8 వ వార్షిక స్పార్క్-23 వేడుకలు నిర్వహించారు. కరెస్పాండెంట్ పోకల జగదీశ్, అధ్యాపక బృందం ఆధ్వ ర్యంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరం కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని కరెస్పాండంట్ జగదీష్ ఆకాక్షించారు.

హౌసింగ్ ఎఇకి ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి -ఏలేశ్వరం

ఏలేశ్వరం గృహ నిర్మాణ శాఖ ఏఈ సువర్ణరాజ్‌కు ఏలూరు గహ నిర్మాణ శాఖ డీఈగా పదోన్నతిపై నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సువర్ణరాజ్‌ను గృహనిర్మాణ కార్యాలయంలో ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ కె శ్రీనివాసరావు సన్మానించారు. ఈ సందర్భంగా డీఈ ఆర్ వేణు గోపాలరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఎం.సుబ్బారావు, కె.ఆనంద్‌కుమార్, పి.రత్న రాజు, కంప్యూటర్ ఆపరేటర్ బి.ప్రసాద్ సువర్ణరాజ్‌కు అభినందనలు తెలియజేశారు.

అంబానీ, ఆదానీల ఎస్టేట్‌గా దేశం

- ఎంఎల్‌సి ఐ. వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పెద్దాపురం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఐవి

75 సంవత్సరాల స్వతంత్ర భారతం సాధించిన సంపదను,ప్రభుత్వ రంగ సంస్థలను,వనరులను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ దేశాన్ని అంబానీ, ఆదానీల ఎస్టేట్‌గా ప్రభుత్వాలు మార్చి వేస్తున్నాయని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఐ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి, చంద్రబాబు నాయుడుల పార్లమెంటు సభ్యులు కేంద్రంలో ఈ అమ్మకాలకు వంత పాడుతున్నారన్నారు. ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పినట్లు ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం కాదని పోలీసు ప్రభు త్వమన్నారు. సిపిఎస్ రద్దు చేస్తానన్న మాట గాలికి వదిలేశారన్నారు. ఉద్యోగులు, కార్మికులు తమ హక్కులసాధన కోసం, సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేయకుండా ప్రభుత్వం నిర్బంధాన్ని ఎక్కుపెట్టిందన్నారు.రైతే రాజని కబుర్లు చెప్పే ప్రభుత్వం కల్లాల్లోనే ధాన్యం కొంటామని, సంచులు ఇస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు. శాసనమండలిలో ఒక్క రోజు కూడా ముఖ్యమంత్రి పాల్గొనలేదన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయటం లేదన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పదోన్నతులను కూడా భర్తీ చేయటం లేదన్నారు. విద్యారంగంలో చేసే మార్పులు కూడా ప్రజాస్వామ్య బద్ధంగా చర్చించి చేయటం లేదన్నారు. నాలుగేళ్ల కాలంలో ఒక్క డిఎస్‌సి కూడా తీయకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతుందన్నారు. ఏకో పాధ్యాయ పాఠశాలలతో నాణ్యమైన విద్యను ఎలా అందిస్తారో చెప్పాల న్నారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ వర్మ,యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి,ఐక్య ఉపాధ్యాయ పత్రిక కన్వీనర్ గిరిధర్ గోపాలకృష్ణ, సూరిబాబు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

ప్రజాశక్తి - కోటనందూరు

: ఖరీఫ్ వరి పంటల సాగు చేస్తున్న రైతులు వద్ద నుండి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని అధికారులకు పెద్దాపురం ఆర్‌డిఒ సీతారామారావు ఆదేశాలను జారీ చేశారు. గురువారం కోటనందూరు తహశీల్దార్ కార్యాల యంలో అధికారులతోనూ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రైతు భరోసా సిబ్బంది, మిల్లర్లు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. తడిసిన ధాన్యాన్ని, రంగు మారిన ధాన్యాన్ని, గ్రేడింగ్ చేయడం విషయంలో నిబంధన తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి సలహాలు సూచనలు ఇవ్వాలని అన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ కిరణకుమార్, వ్యవసాయశాఖ అధికారి కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతి అందుకుంటున్న టైసన్

వెయిట్ లిఫ్టింగ్‌లో హెచ్‌సి టైసన్ ప్రతిభ

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి పోలీస్ స్టేషన్లో విధిని నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ గుబ్బల శ్రీనివాసమూర్తి (టైసన్) అమలాపురంలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వెయిట్ లిఫ్టింగ్‌లో రెండవ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా గండేపల్లి పోలీస్ స్టేషన్లో ఎస్ఐ గణేష్ కుమార్, సిబ్బంది ఆయనను అభినందించారు.



వాటర్ టన్‌లు పంపిణీ చేస్తున్న మట్టే సోదరులు

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం వాలు తిమ్మాపురంలో లలిత ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్తలు మట్టే ప్రసాద్ బాబు, మట్టే శ్రీనివాస్‌లు గురువారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ సైనం బుల్లెమ్మ అధ్యక్షతన జరిగిన సభలో మట్టే సోదరులు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ స్వచ్ఛమైన మంచి నీటిని అందించాలని ఉద్దేశంతో ఈ ప్లాంట్ నిర్మించామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నివసిస్తున్న కుటుంబాల వారందరికీ 600 వాటర్ క్యాన్లు మట్టే బ్రదర్స్ పంపిణీ చేశారు. అనంతరం సైనం సాల్మన్ రాజు ఆధ్వర్యంలో వారిని ఉచిత రీతిన సన్మానించారు.

మాజీ సైనిక అధికారికి సన్మానం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం తిరుపతిలో నిరంతరం క్రీడాభివృద్ధికి తోడ్పడుతూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న మాజీ సైనికాధికారి కుంచే తాతారావును .గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు సాలువాలు, పూలమాలలతో సన్మానించారు. తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కష్ణమూర్తి, దివిలి మాజీ సర్పంచ్ కొత్తం వెంకట శ్రీనివాసరావు, కిర్లంపూడి మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, చదలాడ మాజీ ఎంపీటీసీ కాశి బాబు,సిరివాడ మాజీ సర్పంచ్ బూరాడ అప్పారావు, చౌదరి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు, పాల్గొన్నారు.

గండ్రేడులో రైతులకు డివిడెండ్ల పంపిణీ

ప్రజాశక్తి - పెదపూడి:

గండ్రేడులో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో డివిడెండ్లు పంపిణీ, రచ్చబండ కార్యక్రమాలను ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఈ సొసైటీలో సుమారు 1543 మంది రైతులకు వారి షేర్ ధనంపై రూ.11.20 లక్షలు డివిడెండ్లు పంపిణీ చేశారు. అలాగే సొసైటీ సీజీఎఫ్ నిధులు రూ. 1.50లక్షలతో నిర్మించిన రచ్చబండను ఎమ్మెల్యే ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ యార్లగడ్డ అమ్మన్న చౌదరి, ఎంపీపీ కేతా తులసి, సర్పంచ్ కుడిపూడి మాధవీలత శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు పట్టేందుకు చర్యలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండల పరిధిలోని కాండ్రకోట గ్రామంలో కుక్కలబెడద తీవ్రంగా ఉండటమే కాకుండా కోళ్ళ, పశువులు మనుషులపై దాడులకు పాల్పడు తున్నందున ఆ గ్రామంలో పంచాయతీ అధికారులు కుక్కల నిర్మూలనకు చర్యలు ప్రారంభించారు.గురువారం ప్రజాశక్తిలో ప్రచురితమైన 'వీధి కుక్కల దాడిలో కోళ్ల మత్యువాత' వార్తకు స్పందించిన జిల్లా పంచాయతీ అధికా రులు వెంటనే ఆ గ్రామంలో కుక్కలను పట్టించాలని పెద్దాపురం ఇన్‌చార్జ్ మండల విస్తరణ అధికారిని ఆదేశించారు.దీనిపై ఇన్‌చార్జ్ మండల విస్తరణా ధికారి సత్యనారాయణ మాట్లాడుతూ సంక్రాంతి వెళ్లిన వెంటనే కాండ్రకోటలో కుక్కలను పట్టుకునే కార్యక్రమం చేపడతామని తెలిపారు.

గృహ నిర్మాణాల వేగవంతానికి ఆదేశం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ళు పథకంలో కొమరగిరి లేఅవుట్‌లో చేపట్టిన గృహనిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో గృహనిర్మాణ ప్రగతిపై గురువారం సాయంత్రం హౌసింగ్ ఏఈలు, కాంట్రాక్టర్లు, సంబంధిత విభాగాలతో సమీక్షించారు.

ప్రిన్సిపల్‌గా ప్రయాగమూర్తి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి నియమితులయ్యారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకట్రావు స్వచ్ఛంద పదవీ విరమణతో ప్రస్తుత బోటనీ అధ్యాపకుడు ప్రయాగమూర్తిని ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

గణతంత్ర వేడుకల నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి-అమలాపురం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి అధికారులతో 74 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం సమీక్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక బాలయోగి స్టేడియం నందు జిల్లా స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు చేపట్ట వలసిన ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించి సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను గతంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మాదిరిగా విజయవంతంగా నిర్వహించడానికి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లాస్థాయి అధికారులు ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విధినిర్వహణ లో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులను సత్కరించేందుకు శాఖల వారీగా నిర్దేశిత నమూనాలో ప్రతిపాదన లను ఈ నెల 20వ తేదీ లోపున సమర్పించాలని తెలిపారు. అన్ని శాఖలు పూర్తి సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయాలని డిఆర్ఒ జిల్లా స్థాయి అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఎఎస్‌పి కె. లతామాధురి, ఆర్‌డిఒ వసంత రాయుడు, డిఎఒ కష్ణకుమారి, సిపిఒ వెంకటేశ్వర్లు, ఇ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.నాగేశ్వరరావు, ఉద్యాన అధికారి ఎన్.మల్లికార్జునరావు, డిసిహెచ్ ఎస్.పద్మశ్రీ రాణి, వివిధ శాఖల జిల్లా సాయి అధికారులు పాల్గొన్నారు.

మూలస్థానంలో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని మూలస్థానంలో నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ బండారు సత్యానందరావు పిలుపు మేరకు ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం గురువారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షులు గానుగుల చిన్న, పార్టీ నేతలు ఈదల సత్తిబాబు, మానుపాటి శ్రీను, ఆకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-మండపేట



మరమ్మతులు చేస్తున్న దృశ్యం

మండపేట బైపాస్ రోడ్డుకు కొంతకాలంగా అభివృద్ధికి నోచుకోక పోవడంతో పాడైపోయి గోతుల మయం మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు రోడ్డు భవనాల శాఖ అధికారులు స్పందించారు ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. సుమారు రెండు కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డును రూ.49 లక్షలతో మరమ్మతులు చేస్తున్నామని జెఇ సూర్యనారాయణ గురువారం తెలిపారు.

గంజాయి స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ముమ్మిడివరం పెద్దవంతెన సమీపంలో ఆరుకేజీల గంజాయితో శ్రీనివాసరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ముమ్మిడివరం ఎస్ఐ సురేష్ బాబు గురువారం తెలిపారు. ముగ్గురు వ్యక్తుల పర్యారయ్యారని, వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తెల్ల దోమ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-అయినవిల్లి

శానిపల్లిలంక గ్రామంలో ఉద్యాన అధికారి యం.బబిత అధ్యక్షతన ఉద్యాన శాఖ, ఆత్మా సౌజన్యంతో కొబ్బరిని ఆశించే రూగోస్ తెల్ల దోమ నివారణ చర్యలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆత్మ ప్రాజెక్ట్ అధికారి జ్యోతిర్మయి మాట్లాడుతూ కొబ్బరిలో నిరంతరం నష్టం కల్గిస్తున్న రూగోస్ తెల్ల దోమకు రైతులు నిరంతరం నివారణా చర్యలు చేపట్టాలని కోరారు. నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంబల గోపి కుమారి, డిఆర్‌సి ఎఒ మనోహర్, ఉద్యాన సహాయకులు శ్రీను బాబు, ప్రసాద్, సుధాకర్, సత్య ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.